సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం | 22 | జనవరి | 2023



రూ.50 వేల విరాళం


అమలాపురం టౌన్: వెంకటేశ్వర ఆలయ అభివృద్ధికి వెంకట సాయి ఆక్వా నీడ్స్ యజమాని మంతెన వెంకట రామరాజు, షర్మిల దంపతులు (అమలాపురం) రూ.50 వేలు సమర్పించారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి లంక శ్రీరామమూర్తి (మచిలీపట్నం) శనివారం రూ.2 లక్షల విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 9,450 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,850, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

కానిస్టేబుల్ ఉద్యోగాలకు నేడు ప్రాథమిక పరీక్ష

అమలాపురం టౌన్: పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. ఈ పరీక్షలకు జిల్లాలో 18 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 8 కేంద్రాలు అమలాపురంలోనే ఉన్నాయి. మిగిలిన పదీ జిల్లాలోని ఇతర ముఖ్య కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 8,716 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. ఉదయం 10 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. ప్రతి అభ్యర్థినీ పూర్తిగా తనిఖీ చేశాకే అనుమతిస్తారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లతో పాటు ఫొటో గుర్తింపు కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్నులు మాత్రమే తీసుకు రావాలి. ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులనూ అనుమతించరు. ఆయా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను పోలీసు అధికారులు శనివారం పరిశీలించారు. పరీక్ష కేంద్రాల నిర్వహణపై జిల్లా పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి సమీక్షించారు.

నేడు జాతీయ చిత్రకళా ప్రదర్శన

అమలాపురం టౌన్: కోనసీమ చిత్రకళా పరిషత్ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక శ్రీ సత్యసాయి కల్యాణ మండపంలో జాతీయ చిత్రకళా ప్రదర్శన నిర్వహిస్తున్నారు. కోవిడ్ కారణంగా రెండేళ్లుగా ఈ ప్రదర్శనలు నిర్వహించలేకపోయారు. ఈ మూడేళ్లకూ కలిపి ఒకేసారి 31, 32, 33వ జాతీయ స్థాయి చిత్రకళా పోటీలు, చిత్రకళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు, చిత్రకారుడు కొరసాల సీతారామస్వామి తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన 25 మంది చిత్రకారులు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు. మూడేళ్ల పోటీల్లో అవార్డులు దక్కించుకున్న 243 చిత్రాలను ఈ సందర్భంగా ప్రదర్శిస్తారు. సాయంత్రం జరిగే ముగింపు సభలో విజేతలకు మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ తదితర ప్రముఖులు బహుమతులు అందజేయనున్నారు. రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజను సత్కరించనున్నారు.

బాలబాలాజీకి రూ.1.33 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారికి వివిధ సేవల ద్వారా శనివారం రూ.1.33 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.85,670, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.47,793 చొప్పున ఆదాయం వచ్చింది. స్వామి వారిని 2,496 మంది దర్శించుకున్నారు. 1,975 మంది అన్నప్రసాదం స్వీకరించారని ఆలయ ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో 25 నుంచి విశేష క్రతువులు

- 26న లక్ష దూర్వార్చన, లక్ష కలాలకు పూజ
- 27న విద్యార్థులకు పెన్నుల వితరణ

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకూ మూడు రోజుల పాటు విశేష క్రతువుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 25న గణపతి కల్పంతో పూజలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం పుణ్యాహవాచనం, పంచగవ్యం, దీక్ష, ధారణ, అస్త్రరాజార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష గరిక పూజ, లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తామని తెలిపారు. సప్తనదీ జలాభిషేకానికి గంగ, యమున, గోదావరి, సరస్వతీ, నర్మద, సింధు, కావేరి నదుల నుంచి జలాలు సేకరించామని వివరించారు. 26న లక్ష గరిక పూజ, సరస్వతీ కల్పం, ద్వాదశ శాంతిమంత్ర పఠనం, స్వామివారి పాదాల చెంత కలాల సమర్పణ, పుష్పార్చన, సరస్వతీ హోమం జరుగుతాయని తెలిపారు. 27న సూర్య నమస్కారాలు, సూర్య గ్రాయత్రీ సౌరహోమం, పూర్ణాహుతి, విద్యార్థులతో సరస్వతీ పూజలు, లక్ష కలాల వితరణ జరుగుతాయని పేర్కొన్నారు. ఈ వేడుకలకు భక్తులు, విద్యార్థులు అధిక సంఖ్యలో వస్తారని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేశామని ఈఓ తెలిపారు.

కొలువుల చికిత్స



స్టాఫ్ నర్స్‌గా ఎంపికైన యువతికి నియామక పత్రం అందిస్తున్న ఆర్‌డీ డాక్టర్ పద్మా శశిధర్

ఉమ్మడి 'తూర్పు'న డీఎంఅండ్‌హెచ్‌ఓల పరిధిలో పోస్టుల భర్తీ ఇలా

ఆర్ఎంసీ, కాకినాడ	జీజీహెచ్, కాకినాడ	వైద్య కళాశాల, రాజమహేంద్రవరం	టీచింగ్ ఆస్పత్రి, రాజమహేంద్రవరం	డీసీహెచ్ఎస్	డీఎంహెచ్ఓ
7	11	42	109	103	49

- వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగాల విప్లవం
- ఖాళీ పోస్టులన్నీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భర్తీ
- ఉమ్మడి 'తూర్పు'న 3 వేల నియామకాలు
- ఇప్పటికే 1,186 మిడ్‌లెవెల్.. 26 కేడర్లలో మరో 321 పోస్టుల భర్తీ

సాక్షి, రాజమహేంద్రవరం: అందుబాటులో లేని వైద్యులు.. అరకొర సిబ్బంది.. చాలీచాలని మందులు.. సౌకర్యాల లేమి.. ఇటువంటి అనారోగ్యాలతో సతమతమవుతున్న ప్రభుత్వాసుపత్రులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మూడేళ్లుగా అవసరమైన చికిత్స చేపట్టింది. 'నాడు–నేడు'తో ఆస్పత్రుల అభివృద్ధికి నాంది పలుకుతూనే.. మౌలిక వసతుల కల్పనకూ ప్రాధాన్యం ఇచ్చింది. మరోపక్క వైద్య, ఆరోగ్య రంగంలో ఏ ఒక్క పోస్టూ ఖాళీగా ఉండరాదన్న ఉద్దేశంతో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాల విప్లవానికి శ్రీకారం చుట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ శాఖలో ఇప్పటి వరకూ సుమారు 3 వేల ఉద్యోగాలు భర్తీ చేశారు.

గతంలో వైద్య, ఆరోగ్య శాఖలో ఒక్క పోస్టు భర్తీ చేయాలంటే సంవత్సరాల కాలం పట్టేది. వైద్య విద్య పూర్తి చేసుకున్న వారు, నర్సింగ్ శిక్షణ పొందిన వారు, వివిధ టెక్నీషియన్లు నోటిఫికేషన్ కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చేసేవారు. ఒకవేళ నోటిఫికేషన్ ఇచ్చి నా అరకొర పోస్టులతో ఉద్యోగ సాధన కష్టంగా మారేది. మామూళ్లు ముట్టజెప్పిన వారికే అగ్రతాంబూలం వేసేవారు. దీంతో అర్హులకు అన్యాయం జరిగేది.

ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. ప్రభుత్వ వైద్య రంగం అభివృద్ధికి, వైద్య, ఆరోగ్య శాఖ మెరుగుదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారు. నిత్యం ఏదో ఒక పోస్టు భర్తీకి నోటిఫికేషన్ ఇస్తున్నారు. అర్హత, మెరిట్, సామర్థ్యం ఉన్న వారికి మాత్రమే ఉద్యోగాలు వచ్చేలా సంస్కరణలు చేపట్టారు. ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టింది. ప్రతి 6 నెలలకోసారి ఏదో ఒక నోటిఫికేషన్ ఇస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తోంది. మెరిట్ ప్రాతిపదికగా ఎలాంటి అవకతవకలకూ తావు లేకుండా పోస్టులు భర్తీ చేస్తోంది. ఫలితంగా అర్బన్ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఇతర అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మేరకు సిబ్బంది ఉంటున్నారు. దీంతో వైద్య సేవల్లో ఎటువంటి జాప్యమూ జరగడం లేదు.

ఆర్‌డీ పరిధిలో మూడేళ్లుగా భర్తీ చేసిన ఉద్యోగాల్లో కొన్ని..

జిల్లా	విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	ఎంఎల్‌హెచ్‌పీ స్టాఫ్ నర్సులు
కాకినాడ	410	400
తూర్పు గోదావరి	368	367
కోనసీమ	432	419
అల్లూరి సీతారామరాజు	112	71

పోస్టులు భర్తీ చేశారిలా..

- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1,240 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాల యంలో ఒక్కో హెల్త్ సెక్రటరీ (ఏఎన్ఎం) చొప్పున 1,240 మందిని నియమించారు. వీరు సచివాయాల పరిధిలో ఆరో గ్య కార్యక్రమాలను పర్యవేక్షించడంతో పాటు వారి పరిధిలో ప్రథమ చికిత్స సేవలు అందిస్తున్నారు.
- గ్రామీణ ప్రాంతాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య సేవలు అందించేందుకు బీఎస్సీ నర్సింగ్ విద్య పూర్తి చేసిన అభ్యర్థులను మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు(స్టాఫ్ నర్స్)గా నియమించారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ జోన్–2 జోన్–2 (రాజమహేంద్రవరం) రీజినల్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) పరిధిలోని 8 జిల్లాల్లో ఇప్పటి వరకూ 2,698 మందికి ఉద్యోగాలు కల్పించగా.. ఒక్క ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే 1,186 ఉద్యోగాలు భర్తీ చేశారు. తాజాగా మరో 200 పైగా స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి మార్గం సుగమమైంది. త్వరలోనే వీరు సైతం విధుల్లో చేరనున్నారు. మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు గ్రామణ ప్రాంతాల్లో వైద్యుల పాత్ర పోషిస్తున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్, ఆరోగ్యశ్రీ సేవలను దగ్గరుండి చూసుకుంటున్నారు. వారి పరిధిలో లేని సమస్య అయితే టెలి మెడిసిన్ ద్వారా పీహెచ్‌సీ, జిల్లా కేంద్రంలోని టెలి మెడిసిన్ హబ్‌కు వీడియోకాల్ చేసి వైద్యం అందిస్తున్నారు. ఫలితంగా చిన్నపాటి రుగ్మతలు, జబ్బులకు జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రులకు పరుగులు తీయాల్సిన బాధ తప్పుతోంది.
- కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) పరిధిలోని 26 క్యాడర్లలో 321 నియామకాలు చేపట్టారు. కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులకు మోక్షం కల్పించారు. వెరసి కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ), కాకినాడ ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్), రాజమహేంద్రవరం వైద్య కళాశాల, ఇక్కడి టీచింగ్ ఆస్పత్రి, జిల్లా ప్రభుత్వ వైద్య సేవల సమన్వయాధికారి (డీసీహెచ్ఎస్), డీఎంహెచ్ఓ పరిధుల్లో సిబ్బంది కొరత తీరింది.
- ప్రధానంగా అనస్తీషియా టెక్నీషియన్లు 10, రేడియోగ్రాఫర్ 13, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ 10, జనరల్ డ్యూటీ అటెండెంట్స్ 55, ఎంఎన్ఓ/ఎఫ్ఎన్ఓ 40, ల్యాబ్ అటెండెంట్ 16, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2 – 33, మార్చురీ/పోస్టుమార్టమ్ అటెండెంట్ 7, ఓటీ టెక్నీషియన్ 5, ఆఫీస్ సబార్డినేట్లు 20, ఫార్మసిస్ట్ గ్రేడ్–2 – 24, ప్లంబర్ 7, శానిటరీ అటెండర్/వాచ్‌మన్ 5, ఎఫ్ఎన్ఓ 20 చొప్పున ఉద్యోగాలు భర్తీ చేశారు. అవసరమైన శాఖల్లో అదనపు పోస్టులు సృష్టించి మరీ నియామకాలు జరిపారు.

చరిత్రాత్మక నిర్ణయం



వైద్య రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకూడదన్న ఉద్దేశంతో ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటున్నారు. మా పరిధిలో ఇప్పటికే రెండుసార్లు మిడ్ లెవెల్ స్టాఫ్ నర్స్ పోస్టులు భర్తీ చేశాం. ప్రస్తుతం మరికొన్ని పోస్టుల భర్తీ ప్రక్రియ జరుగుతోంది. పదేళ్ల అనంతరం ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ అవుతూండటం శుభపరిణామం. సిబ్బంది నియామకంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుంది.

– డాక్టర్ పి.పద్మా శశిధర్, రీజినల్ డైరెక్టర్, మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ జోన్–2, రాజమహేంద్రవరం

రోగులకు మెరుగైన వైద్యం



వైద్య శాఖలో ఏ ఒక్క పోస్టూ ఖాళీగా ఉండకూడదనే ప్రభుత్వ నిర్ణయంతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది. ఈ స్థాయిలో ఎప్పుడూ ఉద్యోగాలు భర్తీ కాలేదు. భర్తీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. మెరిట్‌ను ప్రాతిపదికగా తీసుకుంటున్నాం. మా పరిధిలో ఉన్న పోస్టులన్నీ దాదాపు భర్తీ అయ్యాయి.

– డాక్టర్ శాంతిప్రభ, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి, కాకినాడ

పాలవెల్లువ పథకంతో ఎంతో మేలు



జగనన్న పాలవెల్లువ పథకంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జయపాల్

- జిల్లాలో 148 బీఎంసీయూల ఏర్పాటు లక్ష్యం
- జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ జయపాల్

రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న పాల వెల్లువ పథకంతో పాడి రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ జయపాల్ తెలిపారు. పశు సంవర్ధక శాఖ వైద్యులు, డీఆర్‌డీఏ సిబ్బందికి రాయవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయపాల్ మాట్లాడుతూ, ఈ పథకం అమలును కలెక్టర్ హిమాన్షు శుక్లా కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. రాయవరం, కొత్తపేట మండలం వాడపాలేల్లో ఇప్పటికే బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు (బీఎంసీయూ) ప్రారంభానికి సిద్ధమయ్యాయన్నారు. రాయవరం బీఎంసీ యూను త్వరలో ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో 148 బీఎంసీయూలు, 157 ఏఎంసీయూలు ఏర్పాటు చేస్తామన్నారు. మొదటి విడతగా 38 బీఎంసీలు, 28 ఏఎంసీలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. పాడి రైతులను ప్రైవేటు డెయిరీలు, దళారుల నుంచి కాపాడేందుకే ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. పాల ఉత్పత్తి అధికంగా ఉన్న జిల్లాలోని రైతులకు ఈ పథకం ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు. మొదటి విడతగా రాయవరం, మండపేట, రామచంద్రపురం, కె.గంగవరం, ఆలమూరు, కపిలేశ్వరపురం, రావులపాలెం మండలాల్లోని 50 గ్రామాల్లో పాల లభ్యత, ఉత్పత్తి అంచనాకు గ్రామ కమిటీలు వేస్తున్నామని తెలిపారు. ఈ కమిటీలో పంచాయతీ కార్యదర్శి, యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్, యానిమేటర్లు, వలంటీర్లు, క్లస్టర్ కో ఆర్డినేటర్లు సభ్యులుగా ఉంటారన్నారు. వీరు గ్రామాల్లో రైతులకు పాడి పశువుల వివరాలు, పాల లభ్యత తదితర సమాచారం సేకరిస్తారని డాక్టర్ జయపాల్ చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ శివశంకరప్రసాద్ మాట్లాడుతూ ఇతర డెయిరీలకన్నా అమూల్ సంస్థ అత్యధికంగా పాల ధర చెల్లిస్తోందని తెలిపారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు, పశు సంవర్ధక శాఖ ఏడీ రామకృష్ణ, రాయవరం ఏడీ అనితకుమారి, అమూల్ డెయిరీ ప్రతినిధులు దాస్ తివారీ, మన్‌వీర్‌సింగ్, మణికంఠ, ఫీల్డ్ సూపర్‌వైజర్ కిషన్, తదితరులు మాట్లాడారు.

భక్తులతో రత్నగిరి కిటకిట

అన్నవరం: రత్నగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30 వేల మంది స్వామివారిని దర్శించారు. వీరిలో సగం మంది ఉత్తరాది రాష్ట్రాల వారే. ఆలయం వద్ద తీవ్ర రద్దీ ఏర్పడింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. వ్రతాలు 1,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ. 30 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్న దానంలో సుమారు 5 వేల మందికి భోజనం పెట్టారు. తిరుచ్చి వాహనంపై సత్యదేవుని ప్రాకారసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై వేంచేయించి, తూర్పు రాజగోపురం వద్ద ఆలయ ప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తులు



వెంకన్న ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమా లు నిర్వహించారు. స్వామి వారు పూర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయాన్ని ప్రత్యేక పువ్వులతో అలంకరించారు.. స్వామి వార్ని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కు బడులు తీర్చు కుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఆల య అవరణలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు పెన్మెత్స సురేష్‌రాజు, మన్యం బాను, ఆలయ అర్చకులు ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈవో సత్యనారాయణరాజు మాట్లాడుతూ స్వామి వారి ఆలయానికి రూ 10,07,850 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. అలాగే రాజనగరం మండలం నరేంద్రపురంకు చెందిన అడ్డగర్ల రాజేశ్వరీ ఈనెల 14న ఆలయంలో పోగొట్టుకున్న రూ 35 వేలు విలువ చేసే సెల్‌ఫోన్, పర్సు అందులో ఉన్న సొమ్మును అందజేసినట్లు తెలిపారు.

గణతంత్ర వేడుకలకు గరగ బృందం

అంబాజీపేట: ఢిల్లీలో ఈ నెల 26న జరిగే రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొనేందుకు ముక్కామలకు చెందిన పసుపులేటి నాగబాబు గరగ బృందం ఎంపికైంది. ఈ విషయాన్ని నాగబాబు శనివారం తెలిపారు. ఢిల్లీలో జరిగిన రిహార్సల్స్‌లో పాల్గొంటున్నామన్నారు. రిపబ్లిక్ డే నాడు మన రాష్ట్రం నుంచి కోనసీమ ప్రభల ఉత్సవ శకటంతో పాటు గరగ నృత్యాలను కూడా ప్రదర్శిస్తారని తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రతాపరెడ్డి. చిత్రంలో రాజ్యసభ సభ్యుడు బోసు, ఎమ్మెల్యేలు

- జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రతాపరెడ్డి
- అమలాపురంలో జిల్లా స్థాయి సదస్సు

అమలాపురం టౌన్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే అంతిమ లక్ష్యంగా జగనన్న సచివాలయాల కన్వీనర్లు పని చేయాలని.. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పార్టీ పటిష్టతకు మరింతగా నడుం బిగించాలని జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల రాష్ట్ర సమన్వయకర్త పుత్తా ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక గ్రాండ్ పార్కు హోటల్ సమావేశ మందిరంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అధ్యక్షతన జగనన్న సచివాలయాల కన్వీనర్ల జిల్లా స్థాయి సదస్సు శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రతాపరెడ్డి మాట్లాడుతూ, 2024 ఎన్నికలకు సంబంధించిన పార్టీ ప్రణాళికను వివరించారు. త్వరలో నియమించే గృహ సారథులు, వలంటీర్ల పరిధిలో నియమించిన కన్వీనర్లు, సచివాలయ స్థాయి కన్వీనర్లను మండల కన్వీనర్లు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. మరో అతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సచివాలయాల పనితీరును ప్రజల్లోకి కన్వీనర్లు తీసుకుని వెళ్లాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించే లక్ష్యాన్ని చేరుకోవడంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ, జగనన్న సచివాలయాల కన్వీనర్లు ఇప్పటి నుంచే ప్రజలతో మమేకమై, జగనన్న సంక్షేమ పాలనపై ప్రజలకు మరింత అవగాహన పెంచాలని కోరారు. ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ, సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఎంత ప్రయోజనకరంగా ఉన్నాయో ప్రజలకు వివరించేందుకు పార్టీ పరంగా జగనన్న సచివాలయాల కన్వీనర్ల నియామకం విప్లవాత్మక చర్యని అన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు అల్లు రాజుబాబు, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, అమలాపురం పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, నాయకులు వంటిద్దు వెంకన్నాయుడు, కుడుపూడి భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.